క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శాంతిభద్రతలు, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ దుర్గారావు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల దినచర్య గురించి ఆరా తీశారు. వివాదాలు, గంజాయి విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా వారంవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆదేశించారు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారిని ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.కార్యక్రమంలో కొత్తపేట సీఐ చిన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ శ్రీధన లక్ష్మీ కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్యాచార్య ఎస్.ధనలక్ష్మి పర్యవేక్షణలో 20 మంది కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

సైకిళ్లు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విద్యార్థులకు సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఇస్కాన్‌మందిర అధ్యక్షులు మాట్లాడుతూ చదువులో ప్రతిభ చూపిని గుర్తించి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పలు హైస్కూల్.. కాలేజీల నుంచి నుంచి 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి సైకిల్, తృతీయ బహుమతులుగా స్మార్ట్ వాచ్‌లను ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల హెచ్‌ఓడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో, నగరంలోని చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, పటమట సర్కిల్-3 కార్యాలయంలో వీఎంసీ అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తారని అన్నారు. ఆయా కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపీసీపీడీసీఎల్) గృహ వినియోగదారులకు అవకాశం కల్పించిందని చుట్టుగుంట విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ బి.వెంకట్రావ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు విద్యుత్‌లోడు క్రమబద్ధీకరణకు చెల్లించాల్సిన ఫీజులో యాభై శాతం రాయితీని ప్రకటించిందని పేర్కొన్నారు. కిలో వాట్‌కు రూ.2,250 చెల్లించాలని, జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకుంటే రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని, జూన్ 30వ తేది లోపు వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెహ్రూ రోడ్డు విస్తరణ పూర్తయ్యేది ఎప్పుడో!

- తొమ్మిదేళ్ల కిందట కృష్ణా పుష్కరాలకు తొలగించిన నిర్మాణాలు
- ఇంకా రోడ్డు మధ్యలోనే ట్రాన్స్‌ఫార్మర్
- మధ్యలో వదిలేసిన సగం తొలగించిన చెట్టు
- ఆక్రమణలకు గురవుతున్న రోడ్డు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో తొమ్మిదేళ్ల కిందట కృష్ణా పుష్కరాల కోసం ప్రారంభించిన నెహ్రూరోడ్డు విస్తరణ పనులు నేటికి పూర్తికాలేదు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పేరుతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నెహ్రూరోడ్డులోని అనేక భవనాలను అడ్డగోలుగా ధ్వంసం చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. కానీ రోడ్డు విస్తరణను మాత్రం అరకొరగా పూర్తిచేసి చేతులు దులుపుకుంది. అవసరం లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రజలను ఇక్కట్లకు గురిచేయడమేమిటని చంద్రబాబు పరిపాలనపై స్థానికులు మండి పడుతున్నారు. ఇప్పటికీ ఆ రోడ్డులో తొలగించాల్సిన పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్

నెహ్రూరోడ్డులోని కాన్వెంట్ వీధి మలుపు వద్ద స్థానిక విద్యుత్ అవసరాల నిమిత్తం ఆశాఖ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసింది. 2016లో జరిగిన కృష్ణా పుష్కరాల సమయంలో రోడ్డు విస్తరణ నిమిత్తం ఆ రోడ్డులోని భవనాలను కొంతమేర తొలగించి విస్తరణ పనులను చేపట్టిన అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు తొలగించడాన్ని మాత్రం విస్మరించారు. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా రోడ్డు మధ్యలో ఉండిపోవడంతో మలుపు వద్ద వాహనచోదకులు ఇబ్బందులుపడుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరోవైపు బస్టాఫ్ ఉండటంతో



రోడ్డు మధ్యలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అటు బస్సు ఎక్కే, దిగే ప్రయాణికులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు.

తొలగించని చెట్టు మొదలు..

నెహ్రూరోడ్డులోనే విస్తరణలో భాగంగా అప్పటి అధికారులు ఓ భారీ వృక్షాన్ని తొలగించారు. కానీ వృక్షం మొదలును తొలగించకుండా వదిలేశారు. తొమ్మిదేళ్లుగా ఆ చెట్టు మొదలు అలాగే ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పూర్తిగాకపోవడం, విస్తరణ చేపట్టిన ప్రాంతం వినియోగంలోకి రాకపోవడంపై స్థానికులు నగరపాలకసంస్థ అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు.

ఆక్రమణల చెరలో రోడ్డు..

విస్తరణలో భాగంగా అప్పటి అధికారులు ఎంతో విలువైన భవనాలను ధ్వంసం చేసి మరీ రోడ్డును వెడల్పు చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులు అరకొరగానే చేయడంతో విస్తరణ చేసిన ప్రదేశాన్ని పలువురు ఆక్రమించుకున్నారు. తమ వాహ



తొలగించని చెట్టు మొదలు..



ఆక్రమణలకు గురవుతున్న రోడ్డు

నాలను, ఇతర పనులకు వినియోగిస్తున్నారు. దాంతో స్థానిక భవన యజమానులు అధికారుల తీరుపై ఆగ్రహిస్తున్నారు. తమను బెదిరించి, ఇబ్బందులకు గురి చేసి రోడ్డు విస్తరణ చేసిన అధికారులు, రోడ్డుకు చెందిన భూమి ఆక్రమణలకు గురవుతుంటే ఏమి చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు, కార్పొరేషన్ అధికారులు స్పందించి నెహ్రూరోడ్డు విస్తరణ పనులను పూర్తిచేయడంతోపాటు ఆక్రమణల బారినుంచి రోడ్డును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ నేత షేక్ సలీమ్ ఆధ్వర్యంలో వించిపేటలోని ఆయన ఇంటి వద్ద ముస్లిం సోదరులకు ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం సోదరులకు వెలంపల్లి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెలంపల్లి

శిరంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సిబ్బంది



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

పటమట(విజయవాడతూర్పు): అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని, ఆయన్ను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గర్వించదగిన మహనీయుడని కొనియాడారు. ఆయన నిరాహార దీక్షతో రాష్ట్ర ఏర్పాటుకు మార్గదర్శకుడయ్యారన్నారు. తెలుగు భాష గౌరవానికి, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమన్నారు. పొట్టి శ్రీరాములు ఆశయాలను అనుసరిస్తూ, ప్రజలకు సేవ చేయడమే నిజమైన నివాళి అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచి, అభివృద్ధి కార్యక్రమాలను వీఎంసీ చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, సూపరిండెంటింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపీ నాయక్, మేనేజర్ ఏయూబీ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు సేవలు శ్లాఘనీయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుజాతికి పొట్టిశ్రీరాములు అందించిన సేవలు శ్లాఘనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్ స్థానిక సామరంగ్ చౌక్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో వచ్చే ఏడాదికల్లా పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు నూకల నాగేశ్వరరావు, ప్రదీప్, సోలంకి రాజు, అమరా మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ ద్వారా రూ.700 కోట్ల రుణాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఇండియన్ బ్యాంక్ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'ఎస్‌హెచ్‌జీ ఔట్‌రీచ్ క్యాంపెయిన్' నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్ మాట్లాడుతూ తమ జోన్‌లో ఎస్‌హెచ్‌జీ ఆర్థిక సహాయంలో ప్రత్యేకత కలిగిన 3 మైక్రోసెట్ బ్రాంచీలు ఉన్నాయన్నారు. ఎస్‌హెచ్‌జీ బృందాల కార్యాచరణ సౌలభ్యం కోసం విజయవాడలో మరో మైక్రోసెట్ బ్రాంచిని ప్రారంభించనున్నామని తెలిపారు. ఇండియన్ బ్యాంక్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సుమారు 4వేలు ఎస్‌హెచ్‌జీ గ్రూపులు కలిగి ఉందని, వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్) జి.రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ ఎస్‌హెచ్‌జీ ఔట్‌రీచ్ క్యాంపెయిన్‌లో ఇండియన్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 480 బ్రాంచిల్లో మొత్తం రూ.700 కోట్ల మేర ఎస్‌హెచ్‌జీ రుణాలను మంజూరు చేసిందని వివరించారు. తద్వారా మహిళా సాధికారత, వారి స్వయం సమృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు. రూరల్ బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ జీఎం చంద్రశేఖ



ఎస్‌హెచ్‌జీ ఔట్‌రీచ్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న బ్యాంకు అధికారులు

రన్ వీ మాట్లాడుతూ చాలామంది వ్యక్తులు తమ చిన్నచిన్న వ్యాపారాల అవసరాల కోసం అధిక వడ్డీ రేటుతో ప్రైవేట్ వ్యక్తుల దగ్గరకు వెళుతున్నారని, తద్వారా వారి జీవనం కష్టతరమవుతుందన్నారు. ఇండియన్ బ్యాంక్‌లో ఎస్‌హెచ్‌జీ బృందాలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు అందిస్తున్నామని వివరించారు. అలాగే వారిని లక్షపతులుగా చేసే 'లక్షపతి దీదీ' గురించి వివరించారు. సమావేశంలో ఇండియన్ బ్యాంక్ అమరావతి జోనల్ మేనేజర్ డీఎస్ మూర్తి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, వీఎంసీ యూసీడీ పీడీ పి.వెంకట నారాయణ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తనభార్య కనిపించడం లేదంటూ ఓవ్యక్తి ఫిర్యాదు చేయడంతో కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తపేట బ్రహ్మణవీధికి చెందిన చెరువు సుబ్రహ్మణ్యశర్మ, ఈనెల 13వతేదీ నుంచి తనభార్య తేజస్విని కనిపించడం లేదంటూ పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువతి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన మరదలు కనిపించడం లేదంటూ ఓవ్యక్తి ఆదివారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..పాత రాజరాజేశ్వరిపేట 4వ లైన్‌లో దాసరి మిథున్ చక్రవరి కుటుంబం నివాసం ఉంటోంది. గతనెలలో జరిగిన గుణదల తిరునాళ్ల కోసం మిథున్‌చక్రవరి భార్య చెల్లెలు సుమ(21) వీరి ఇంటికి వచ్చింది. ఈక్రమంలో ఆదివారం ఉదయం నుంచి సుమ కనిపించడం లేదు. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

24న గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ సభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఈనెల 24న గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయంలో గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తి కార్యదర్శి లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయాలకు అవసరమైన నిధులు కేటాయించాలని, పుస్తకాలు కొనుగోలు చేయాలని తదితర సమస్యలపై రచయితలు, పుస్తక ప్రచురణ కర్తలు ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కమిటీలుగా ఏర్పడి ముందుకు సాగుతున్నారన్నారు. సభలో ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ పాల్గొంటారన్నారు.

రసరమ్య కావ్యం రామాయణం

విజయవాడ కల్చరల్: రసరమ్య కావ్యం శ్రీమద్రామయణమని ఆధ్యాత్మికవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారయణమూర్తి అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వర్ధంతి సందర్భంగా ఉత్తరాధికారి విదుశేఖర భారతి ఆదేశంతో దుర్గాపురంలోని శివరామకృష్ణ శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు పురాణ వైభవాన్ని చాటుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో మల్లాప్రగడ వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణం అంశంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ దశరధుని పుత్రకామేష్టి, రామలక్షణ, భరత శత్రఘున్నల జననం, సీతాదేవిని వివాహం చేసుకోవడం తదితర అంశాలను మధురంగా వినిపించారు.

తాళ్లపాక అన్నమయ్యకు స్వరార్చన

విజయవాడ కల్చరల్: తెలుగు సంకీర్తనలకు, పదానికి గుడికట్టిన మహనీయుడు తాళ్ళపాక అన్నమయ్య అని విఖ్యాత మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగు కళావాహిని, సంగీత సమ్రాట్ సంస్థ, శ్రీకళాభారతి, సంగీత సమ్రాట్ సంగీత సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదికల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం అన్నమయ్యకు స్వరార్చన, వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగంశెట్టి చంద్రశేఖర్, సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ శేషుకుమార్, కే డేవిడ్ రాజు ప్రసంగించారు. సంగీత కళాకారులు గురజాడ మధుసూధన రావు, కేవీబీ ఆనంద్, బీ మల్లీశ్వరి అన్నమయ్య రచించి బాల కృష్ణ ప్రసాద్ స్వరపరచిన కీర్తనలను ఆలపించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు ఆధ్వర్యంలో మృదంగ విద్వాంసుడు యల్లా వెంకటేశ్వరరావును వివిధ రంగాలకు చెందిన మందరపు హైమవతి, మరడాన సాంబశివ రావు, గుంటుపల్లి నానయా చౌదరి, అన్నమయ్య సంకీర్తలను గానం చేసిన గాయకులను ఆత్మీయంగా సత్కరించారు. చింతకాయ చిట్టిబాబు, పూర్ణచంద్రిక నిర్వహించారు.



డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ డెఫ్ (మూగ- చెవిటి) ఉమెన్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బధిర మహిళలకు కుట్టు మిషన్, బ్యూటీషియన్ వంటి కోర్సులలో శిక్షణ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బధిర మహిళల సంఘానికి స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి మూగ చెవిటి భాష అనువాదకులు కారడి రాజు, ఠాగూర్ గ్రంథాలయ గ్రేడ్ వన్ గ్రంథాలయాధికారి కే రమాదేవి, ఠాగూర్ లైబ్రరీ అసిస్టెంట్ కే రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ ఉమెన్ అధ్యక్షుడు ఎస్.ధరణికుమారి, ప్రధాన కార్యదర్శి అరుణ, బధిర మహిళలు పాల్గొన్నారు.



మధురంగా సాగిన శివానీ వయోలిన్ కచేరీ

విజయవాడ కల్చరల్: స్వరతరంగిణి నెలవారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలోని పోలవరపు లలితా కామేశ్వరి కల్యాణ మండపంలో చెన్నైకి చెందిన వీఎస్‌పీజీ శివానీ నిర్వహించిన వయోలిన్ కచేరీ మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా పలికించారు. మృదంగంపై పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, వయోలిన్‌పై సరస్వతుల హనుమంతరావు సహకరించారు. స్వరతరంగిణి నిర్వాహకులు గండూరి రమాసత్యనారాయణ, గండూరి శ్రీనివాసమూర్తి నిర్వహించారు. మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.



వయోలిన్ కచేరీ నిర్వహిస్తున్న శివానీ

శ్రీరామతత్వాన్ని చాటిన నాటక ప్రదర్శన

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో సురభి నాటకోత్సవాలలో భాగంగా ఆదివారం సురభి నాటక సంప్రదాయాన్ని పాటిస్తూ లవకుశ నాటికను ప్రదర్శించారు. వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణం అధారంగా రచించిన లవకుశ ఆధారం. రావణ వధ అనంతరం రాముడు అయోధ్యకు రావడం, శ్రీ రామ పట్టాభిషేకం ఇలా పలు అంశాలుగా నాటకం సాగుతుంది. ప్రదర్శకులు భానోదయ నాట్యమండలి, సరదా నాట్యమండలి సంబంధించిన నటీనటులు 50 మంది నాటకంలో పాల్గొన్నారు. నాటకం ఆద్యంతం రక్తికట్టింది. లవునిగా తనూజ, కుశునిగా హేమాన్వీ, రామునిగా నాగబాబు, సీతాదేవిగా హేమమాలిని, వాల్మీకిగా వెంకటేశ్, లక్ష్మనునిగా భానుప్రకాష్ నటించారు. నాటకాన్ని ప్రారంభించిన నాట్యాచారిణి స్వర్ణలత మాట్లాడుతూ 145 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రకలిగిన సురభి సంస్థ కాలం మారుతున్నా నాటక విలువలకు కట్టుబడి నాటక ప్రదర్శనలు చేస్తునట్లు తెలిపారు. నర్తనం సంపాదకురాలు మాధవి పురాణం, సాంస్కృతిక శాఖ సాంస్కృతిక కార్యక్రమాల ప్రధాన నిర్వాహకుడు సుమన్ నిర్వహించారు.



ఘంటసాల మ్యూజిక్ కళాశాలలో లవకుశ నాటకంలో ఒక సన్నివేశం

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రత్యేక డ్రైవ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని కలెక్టర్ లక్ష్మీశ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కొండపల్లి మున్సిపాల్టీ ఉద్యోగులు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. చికెన్ సెంటర్లు, కిరాణా షాపులు, మార్కెట్ సెంటర్, ఫ్యాన్సీ, బడ్డీకొట్లలో తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. కవర్లు వినియోగిస్తున్న వారికి మొదటి విడతగా రూ.300 ఫైన్ విధించారు. రెండోసారి పట్టుపడితే రూ. 2 వేలు జరిమానా విధిస్తామని దుకాణదారులను హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వినియోగించవద్దని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కదలని మురుగు–తొలగని సిల్టు

- పారిశుద్ధ్యంపై కొరవడిన శ్రద్ధ
- పేరుకుపోతున్న సిల్టు
- అధికారుల పర్యవేక్షణ కరువు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం రైల్వే కాలనీ, భానూనగర్, మధురానగర్ పసుపుతోటలో మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయటం లేదు. దీంతో మురుగుకాలువల్లో సిల్టు పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోతోంది. మురుగు నిలిచిపోవటవం వల్ల దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి.

అధికారులకు ఫిర్యాదు చేసినా..

ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు పెరిగిపోవటం వల్ల వాటి ధాటికి కంటినిండా నిద్ర కరువయ్యిందని వాపోతున్నారు. తామెన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ మురుగు కాలువల వల్ల దోమలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు.

స్పందించాలని వినతి..

ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగుకాలువలు శుభ్రం చేయటంతో పాటు దోమల నివారణచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిచిన మురుగు



శివకేశవ దేవాలయం సమీపంలో..